**కథ**

# వెలగనీ ఒక దీపాన్ని..!

''రేణూ! ఏవిటంత దీక్షగా చూస్తున్నావు పేపర్ని?'' న్యూస్పేపర్ని ముందేసుకుని కూర్చున్న రేణుకని చూస్తూ ప్రశ్నించాడు సారథి.

రేణుక జవాబివ్వ లేదు, పేపర్లో దేన్నో శ్రద్ధగా చదువుతోంది.

ఆమె అంత శ్రద్ధగా ఏం చదువుతోందా అన్న ఆసక్తితో పేపర్లోకి తొంగి చూశాడు.

ఎంసెట్ రిజల్ట్స్ వచ్చినట్టున్నాయి. టాప్ ర్యాంకర్ల ఫొటోలు, ఇంటర్వ్యూలతో ఆ పేజీ నిండిపోయి వుంది.

ఆ స్టూడెంట్లు ఇచ్చిన ఇంటర్వ్యూలని ఆమె చాలా సీరియస్గా చదువుతోంది.

''ఏవిటీ? ఆ ఇంటర్వ్యూలు అంత ఇంటరెస్టింగ్గా వున్నాయా?'' అడిగాడతను.

ఆమె వినిపించుకోలేదు కాబోలు. బదులు చెప్పలేదు.

''విషయమేమిటో తర్వాత తనే చెబుతుందిలే'' అనుకుంటూ, తను అర్జంటుగా సంతకాలు చేయాల్సిన ఫైల్ అందుకున్నాడు సారథి.

కాస్సేపయ్యాక రేణుక లేచి అతని దగ్గరికి వచ్చింది. ''అయ్యయ్యో... టైము చూసుకోలేదు. భోజనానికి పదండి, ఇప్పటికే లేటైంది'' అంది నొచ్చుకుంటూ!

''రాత్రి భోజనానికి కూడా టైమ్ మెయిన్టైన్ చేసే శ్రీమతిగారు ఈవేళ టైమ్ మరచిపోవడానికి కారణమేమిటో...?'' సారథి నవ్వుతూ అడిగాడు.

''ముందు భోజనానికి పదండి'' హడావుడిగా కిచెన్లోకి దారితీసింది రేణుక!

భోజనాలు అయి వస్తూనే తిరిగి పేపర్ ముందేసుకుని కూర్చున్న రేణుకని కించిత్ ఆశ్చర్యంగా చూశాడు సారథి.

తదేకంగా పేపర్లోకి చూస్తూ ఏదో ఆలోచనలో పడ్డట్టున్న భార్యని పలకరించే ప్రయత్నం చేయలేదు. ఆమె అంత సీరియస్గా ఏదో ఆలోచిస్తున్నదంటే, ఆమె బుర్ర ఏ బృహత్ పథకానికో శ్రీకారం చుడుతున్నదన్నమాటే!

సారథి నవ్వుకుంటూ ఫైల్లో సంతకాలు చేయడంలో నిమగ్నమయ్యాడు.

రేణుక ఆలోచన ముగిసినట్టుగా పేపరూ పెన్నూ ముందేసుకుని సీరియస్గా ఏదో రాయడం మొదలుపెట్టింది.

ఫైల్లో సంతకాలు పెడుతూనే మధ్య మధ్యలో ఆమెను గమనిస్తున్న సారథి ''ఏం రాస్తున్నావు?'' అని అడగలేదు. ఆమె తన దగ్గర ఏ విషయమూ దాచదని అతనికి బాగా తెలుసు. చెప్పేదే చేస్తుంది. చేసేదే చెబుతుంది. కాస్తయినా తేడా రానివ్వదు యమ డిసిప్లినేరియన్.

కాస్సేపట్లో ఆమే తన దగ్గరికి వచ్చి అంతా వివరంగా చెబుతుంది. వినేందుకు తనకి ఇంట్రెస్ట్ లేకపోయినా వదలదు. భార్యాభర్తల్లో ఒకరు వేసే ప్రతీ స్టెప్పూ రెండో వాళ్ళకి తెలిసి వుండాలంటుంది. సీక్రెట్స్ అన్నది లేకుండా ఒకరి మనసు ఒకరికి అద్దంలా కనబడాలంటుంది. ఎ పర్ఫెక్ట్ అండ్ ఎ సిన్సియర్ వుమన్ ఐ హావ్ ఎవర్ సీన్ ఇన్ మై లైఫ్ సో ఫార్..

సంతకాలు చేసేసి, ఫైల్ మూసి పక్కన పెట్టిన సారథి... ఆమెనే చూస్తూ కూర్చున్నాడు. అప్పుడే రాయడం ముగించిన రేణుక, భర్త పక్కనే కూర్చుంది.

''మీతో ఒక విషయం చెప్పాలి'' ఉపోద్ఘాతం మొదలైంది.

సారథి ఆమె వైపు చూసి నవ్వాడు. ''నువ్విప్పుడు ఏదో చెబుతావని నువ్వు పేపర్ ముందేసుకుని తంటాలు పడుతున్నప్పుడే ఊహించాను.''

''ఏమని?'' తనూ నవ్వుతూ అడిగింది రేణుక.

''ఏమనో నాకేం తెలుసు? ఏదో చెబుతావని మాత్రం తెలుసు. ఆ పేపర్ ముందు కూర్చుని, నువ్వు ఆలోచనలో పడ్డప్పుడే నీ బుర్రలో పంచవర్ష ప్రణాళికలాంటిదేదో రూపుదిద్దుకొని వుంటుందని నాకు తెలుసు.''

''అఫ్కోర్స్... యూ ఆర్ కరెక్ట్. ఈరోజు పేపర్ చూశారా?'' రేణుక ఉత్సాహంగా అడిగింది.

''ఏదీ నువ్వు నాకు ఇస్తే కదా. ఆఫీసు నుంచి వచ్చిన దగ్గర నుండీ తెగ చదువుతున్నావు. ఇంతకీ ఏవిటో విశేషం?'' భార్య ఉత్సాహాన్ని చూస్తూ అడిగాడు సారథి.

''ఇది చూడండి'' అంటూ ఎమ్సెట్ టాప్ ర్యాంకర్ల ఇంటర్వ్యూలు వున్న పేజీని అతని ముందు పరచింది.

''ఫొటోలు చూడాలా? ఇంటర్వ్యూలా?'' అమ్మాయిల ఫొటోలవైపు చూస్తూ చిలిపిగా అన్నాడు.

ఆమె అదేం పట్టించుకోకుండా, ''ఈ అబ్బాయిని చూడండి'' అంటూ సెకండ్ ర్యాంక్ వచ్చిన అబ్బాయి ఫొటో చూపించింది.

''చూశాను. బావున్నాడు'' చెప్పాడతను.

''ఆ పిల్లవాడి కళ్ళల్లో ఒకలాంటి పట్టుదల, కాస్తంత నైరాశ్యం రెండూ కనబడుతున్నాయి కదూ?'' ఫొటోని అతని దగ్గరగా జరుపుతూ అంది రేణుక.

''ఆ... కనబడుతున్నట్టే వున్నాయి'' ఫొటోని పరీక్షగా చూస్తూ చెప్పాడు సారథి.

''ఆ కుర్రాడిచ్చిన ఇంటర్వ్యూ చదివి నేనెంత మూవ్ అయిపోయానో తెలుసా? ఎమ్సెట్ రాయాలనే ఉత్సాహంతో ఎంట్రన్స్ టెస్ట్ రాసాడంట. కానీ అతన్ని చదివించే స్థోమత వాళ్ళ పేరెంట్స్కి లేదంట. వాళ్ళ నాన్న ఓ చిన్న ఉద్యోగస్తుడట. చాలీ చాలని ఆదాయంతో, అంత పెద్ద చదువు చదవడం అసంభవం అని చెప్పాడు ఇంటర్వ్యూలో. ఆ అబ్బాయి తెలివితేటలు, కేవలం డబ్బు లేకపోవడం వల్ల అలా మరుగునపడిపోవడం చాలా అన్యాయం అనిపిస్తోంది నాకు. ఆ జీనియస్ పెద్ద చదువులు చదివి, మన దేశానికి ఉపయోగపడాలి. అందుకని ఆ అబ్బాయిని నేను చదివించదలుచుకున్నాను.''


పేపర్లో నుండి తలెత్తి భార్య వైపు చూశాడు సారథి. ఆమె కళ్ళల్లో ఆ పిల్లవాడి పట్ల జాలి, అతనికి సహాయం చెయ్యాలనే తపన స్పష్టంగా కనబడుతున్నాయి.

''వెరీగుడ్! మంచి డెసిషన్ తీసుకున్నావు.'' సారథి ఆమెను అభినందిస్తూ అన్నాడు.

''ఆ అబ్బాయిని వెంటనే బయలుదేరి రమ్మని లెటర్ కూడా రాశాను.'' రేణుక లెటర్ని భర్త చేతికిచ్చింది.

సారథి లెటర్ విప్పి చదవడం మొదలుపెట్టాడు.

చిరంజీవి ఆనంద్కి,



ఆశీస్సులతో..

నువ్వు ఎమ్సెట్‌లో సాధించిన ర్యాంక్‌ని, నీ ఇంటర్వ్యూని పేపర్‌లో చూసి ఈ లెటర్ రాస్తున్నాను. డబ్బులేని కారణంగా నువ్వు నీ కోరిక ప్రకారం పై చదువులు చదవలేకపోవడం ఎవరికైనా బాధ కలిగించే విషయమే. నువ్వు ఎమ్సెట్‌లో సాధించిన [illegible] ర్యాంక్ వృధా కావడం మంచి పరిణామం కాదు.

నీ చదువుకు కావలసిన ఆర్థిక సహాయం నేను చేస్తాను. నువ్వు సందేహించకుండా వెంటనే కాలేజ్‌లో చేరు. నీకిష్టమైతే ఈ లెటర్ అందిన వెంటనే వచ్చి నన్ను సంప్రదించు. నా విజిటింగ్ కార్డు, ఈ లెటర్‌తో జత చేస్తున్నాను.

మై బెస్ట్ విషెస్ టూ యూ.

సిన్సియర్లీ,

రేణుక.

ఉత్తరం చదవడం ముగించి, తిరిగి కవరులో పెట్టాడు సారథి.

''ఆ కుర్రాడిని వెంటనే రమ్మన్నావు బాగానే వుంది. అతని దగ్గర డబ్బు వుందో లేదో. రావడం కష్టమేమో పాపం. ట్రైన్ టికెట్స్‌కి డబ్బు కూడా పంపించు..'' అన్నాడు కవర్ని భార్య చేతికందిస్తూ.

రేణుక క్షణం సేపు భర్తవేపు తదేకంగా చూసింది.

''మీరెంత మంచివారు'' ఆనందోద్వేగాలతో అతని రెండు చేతులూ తన చేతుల్లోకి తీసుకుంటూ అంది.

''నీకంటేనా?'' ఆమె వేపు నవ్వుతూ చూశాడు.

''రేణూ! నువ్వు చేస్తున్నది చాలా మంచి పని. ఆ ఆలోచన నీకొచ్చినందుకే నిన్ను నేను అభినందించి తీరాలి. ఓ కుర్రాడి చదువుకి మనం సహాయం చేసినంత మాత్రాన మన సంపదేమీ తరిగిపోదు. భగవంతుడి దయవల్ల మన కంపెనీ మంచి టర్నోవర్‌తో నడుస్తోంది. డబ్బుని ఎప్పుడైనా సరే సద్వినియోగం చేయడానికే ఉపయోగించాలని నీవనే మాటతో, నేనూ ఏకీభవిస్తాను. గో ఎహెడ్. రేపే ఆ కుర్రాడికి ఎమ్.ఓ. చెయ్యి. సరేనా?'' భార్య తలమీద చేతితో నిమురుతూ అన్నాడు సారథి.

రేణుక చటుక్కున ఆ చేతిని అందుకుని తన చెంపల కానించుకుంది. ఆమె కళ్ళల్లోంచి వెలువడిన భాషకందని భావం ఏదో అతని అరచేతిని ముద్దాడింది.

★★★

''అమ్మగారూ! మీకోసం ఎవరో వచ్చారు. మిమ్మల్ని కలవాలంటున్నాడు.''

రేణుక టైము చూసింది.

ఏడున్నర కావస్తోంది.

బ్రేక్‌ఫాస్ట్ చేయడానికి అప్పుడే డైనింగ్ హాల్లోకి వచ్చిందామె!

చైర్‌లో కూర్చుంటూ ''ఎవరూ? పేరేంటో కనుక్కున్నావా?'' అడిగింది వాచ్‌మెన్‌ని.

''ఎవరో కుర్రాడు అమ్మగారూ. పేరు ఆనంద్ అని చెప్పాడు'' చెప్పాడు వాచ్‌మెన్.

సారథి ప్లేట్లో ఇడ్లీలు వడ్డిస్తున్న రేణుక చప్పున తలెత్తి, ''ఆనందా, వెంటనే లోపలికి పంపించు. ఇక్కడికే డైనింగ్‌హాల్‌కే పంపించు'' అంది.

విశారద

''నీ లెటర్‌కి సమాధానంగా తిరుగు టపాలో భలేగా వచ్చేశాడే ఆ కుర్రాడు'' సారథి కాస్త ఆశ్చర్యంగా అన్నాడు.

''శ్రద్ధ, పట్టుదల అంటే అలాగే వుండాలి'' రేణుక ఆనందంగా అంది.

మరో రెండు నిమిషాల్లో సన్నగా, పొడవుగా వున్న ఓ కుర్రాడు వాచ్‌మెన్ వెంట అక్కడికి వచ్చాడు.

''నమస్తే!'' ఇద్దరి వైపు చూస్తూ వినయంగా చేతులు జోడించాడు.

రేణుక నవ్వుతూ కూర్చోమన్నట్టు కుర్చీ చూపించింది.

''ఫర్వాలేదు మేడమ్.'' మొహమాటపడ్తూ అన్నాడతను.

''అలా మొహమాటపడతావేంటోయ్. కాబోయే డాక్టరువి. ఇలా కూర్చో మాతోబాటు టిఫిన్ చేద్దూకానీ.'' తన పక్క చైర్ కొద్దిగా వెనక్కి జరుపుతూ అన్నాడు సారథి.

అతను మొహమాటపడ్తూనే కూర్చున్నాడు.

''దుర్గా! అతనిక్కూడా టిఫిన్ పెట్టు'' పని పిల్లని పిలిచి చెప్పింది రేణుక. తినడానికి సిగ్గుపడుతున్న అతన్ని చూస్తూ ''తినవయ్యా... తిండి దగ్గర సిగ్గుపడకూడదు'' అంది.

ఆ కుర్రాడు వంచిన తల ఎత్తకుండా తిన్నాడు. దుర్గ కాఫీలు తెచ్చి అందరికీ అందించింది.

కాఫీ సిప్ చేస్తూ రేణుక అతన్ని పరీక్షగా చూసింది. మంచి, మన్ననతో పాటు తెలివి తాలూకు చురుకుదనం కూడా అతన్లో కనిపిస్తోంది.

''మా లెటర్ అందగానే వచ్చినందుకు చాలా సంతోషం'' సారథి అతని భుజం మీద తడ్తూ అన్నాడు.

''నీకు మెడిసన్ చదవాలని వుందా?'' సీరియస్‌గా అడిగింది రేణుక.

''చాలా వుందండి. కానీ మాకంత కెపాసిటీ లేదు'' తలొంచుకుని చెప్పాడు ఆనంద్.

''నువ్వు చదవదల్చుకున్నది చదువు. నీ చదువు ఖర్చంతా మేం భరిస్తాం. నువ్వు బాగా చదివి నీ ఎయిమ్ ఏవిటో అది సాధించు. దట్సాల్.'' చెప్పింది రేణుక.

అతను నమ్మలేనట్టు, నోటమాట రానట్టు రెప్పవేయడం మరచి పోయినట్టు అలాగే చూశాడు ఆమె వైపు.

''వెంటనే కాలేజీలో అప్లికేషన్ పడెయ్యి. అన్నట్టు ఏ కాలేజ్‌లో చేరతావు?'' అడిగిందామె.

''మాకు నియరెస్ట్ ప్లేస్ మెడ్రాస్. అక్కడ చేరతాను మేడమ్'' కలో నిజమో అర్థం కాని స్థితిలో చెప్పాడతను.

''దట్స్ గుడ్. హాస్టల్‌కి కూడా అప్లై చెయ్యి.''

''వద్దు మేడమ్, హాస్టల్‌కి చాలా ఖర్చవుతుంది. నేనొక రూమ్ తీసుకుని వండుకుని తింటాను. హాస్టల్‌లో అయితే, మిగతా స్టూడెంట్స్ డిస్టబెన్స్ కూడా వుంటుంది. విడిగా రూమ్ తీసుకుంటే, నేను ప్రశాంతంగా చదువుకో వచ్చు.'' తన అభిప్రాయాన్ని మెల్లగానే అయినా స్థిరంగా చెప్పాడు.

చదువుమీద అతనికున్న శ్రద్ధకి ముచ్చటేసింది రేణుకకి.

''వెరీగుడ్! అలాగే చెయ్యి. మిగతా విషయాలు ఈవెనింగ్ మాట్లాడుకుందాం. మాకు ఆఫీసు టైమవుతోంది. దుర్గ నీకు గెస్ట్‌రూమ్ చూపిస్తుంది. గో అండ్ టేక్ రెస్ట్'' చెబుతూనే కుర్చీలోంచి లేచింది రేణుక.

''లేదు మేడమ్. నేను వెళ్తాను. ఇంకో గంటలో బస్సుంది'' తనూ లేస్తూ చెప్పాడు ఆనంద్.

చూస్తున్న న్యూస్‌పేపర్ని పక్కన పడేస్తూ సారథి కూడా లేచాడు.

''ఓ.కె.మై బోయ్. జాగ్రత్త! వెళ్ళడానికి డబ్బులున్నాయా?'' జేబు లోంచి పర్సు తీస్తూ అడిగాడు.

ఆనంద్ చప్పున ఒక్కడుగు వెనక్కి వేసి, ''వున్నాయి సార్ మీరు పంపిన డబ్బుంది. సరిపోతుంది.'' అన్నాడు వాళ్ళ మంచితనానికి అబ్బురపడ్తూ.

''సరే... నువ్వు కాలేజీ ఫీజులు ఎంత కట్టాలో తెలియపరిస్తే, ఎప్పటికప్పుడు మేం పంపిస్తూంటాం.'' అక్కడి నుంచి కదులుతూ అంది రేణుక.

''మేడమ్ వన్ మినిట్..'' వెనక నుంచి ఆనంద్ కంగారుగా పిలిచాడు.

రేణుక వెనక్కి తిరిగింది. ''ఏవిటో చెప్పు?'' నవ్వుతూ అడిగింది.

ఆనంద్ ఓ క్షణం రేణుకని, సారథిని అలాగే చూశాడు. ఏదో చెప్పాలని ప్రయత్నించాడు. సాధ్యం కాలేదు. గొంతు పెగల్లేదు. చప్పున ముందుకు వంగి ఇద్దరి పాదాలకీ నమస్కారం చెయ్యబోయాడు.

''ఛఛ... అదేం పిచ్చిపని.'' సారథి అతని భుజాలను పట్టుకుని పైకి లేపాడు. ఆనంద్ కళ్ళనిండా నీళ్ళు. మాటల కంటే కన్నీళ్ళే కృతజ్ఞతను బాగా వ్యక్తం చెయ్యగలవు కాబోలు!

''వస్తానండి'' వినయంగా చేతులు జోడించి అతను వెళ్ళిపోయాడు.

''కుర్రాడు చాలా మంచివాడులా వున్నాడు కదండీ'' వెళ్తోన్న ఆనంద్‌ని చూసి ముచ్చటపడ్తూ అంది రేణుక.

''నువ్వు సెలెక్ట్ చేశాక మంచివాడు కాక మరేమవుతాడు? వెళ్ళేటప్పుడు డబ్బులివ్వబోయినా తీసుకోలేదంటే, మంచివాడు, నిజాయితీపరుడే అనుకోవాలి మరి. సర్లే ఇవన్నీ సాయంత్రం మాట్లాడుకుందాం. ఆఫీసుకు టైమవుతోంది. పద పద..'' ఆమెను తొందరపెడ్తూ, అక్కడ నుండీ కదిలాడు సారథి.


★★★

మరో పది రోజుల లోపే, ఆనంద్ ఫీజులకి, పుస్తకాలకీ, రూమ్ రెంట్‌కీ కలిపి డ్రాఫ్ట్ తీసి పంపింది రేణుక!

ఆ రాత్రి కాస్త తీరిగ్గా భోజనాలు చేస్తూండగా చెప్పింది రేణుక. ''ఆ కుర్రాడి దగ్గర నుంచి లెటర్ వచ్చిందండీ. మనం పంపిన డ్రాఫ్ట్ అందిందట. పదే పదే కృతజ్ఞతలు చెబుతూ రాశాడు.''

''కృతజ్ఞతలు చెప్పడంకాదు బాగా చదవమని చెప్పు. ఎలా చదువుతున్నదీ, మార్కులెలా వస్తున్నదీ మనకి లెటర్స్ రాస్తుండమని చెప్పు.'' రేణుకకి సలహా ఇచ్చాడు సారథి.

కాలేజ్‌లో చేరిన నెలరోజుల తర్వాత ఆనంద్ నుంచి వచ్చిన లెటర్ రేణుకని ఆశ్చర్యంలో ముంచేసింది. ఆ నెల రూమ్‌రెంట్ దగ్గరనుంచి కాలేజ్ ఫీజులు, పుస్తకాలకి అయిన ఖర్చంతా అణాపైసలతో సహా లెక్కరాసి పంపాడు. అలా అకౌంటు రాయడం వల్ల ఎంత ఖర్చవుతున్నదీ ఇరువైపులా ఒక అంచనా వుంటుందని, కాబట్టి ప్రతీ నెలా అయ్యే ఖర్చు అలాగే రాసి పంపిస్తానని ఆ లెటర్ సారాంశం.




ఆశ్చర్యానందాలతో రేణుక ఆ లెటర్‌ని భర్తకి చూపించింది.

''ఈరోజుల్లో కూడా ఇంత నిజాయితీ, పద్ధతీ కలిగిన కుర్రాళ్ళున్నారంటే ఆశ్చర్యంగానే వుంది సుమా! మన పిల్లలు చూడు... హాస్టల్‌కి ఎంత డబ్బు పంపినా చాలదు. ఇంకా పంపమంటూ ఫోనుల మీద ఫోన్లు చేస్తారు. ఎనీహౌ, నువ్వు ఓ మంచి కుర్రాడి జీవితాన్ని నిలబెట్టడానికి పూనుకు

...న్నావు. అది ఆ కుర్రాడి అదృష్ట... ఓ నిజాయితీ నీరుగారిపోకుండా నీ చేతు... ...పెట్టి నిలిపావు.'' భార్యని అభినందిస్తూ అన్నాడు సారథి.

★★★

చూస్తుండగానే సంవత్సరం గిర్రున తిరిగింది.

...ఫస్టియర్ మార్కుల లిస్టుతోపాటు, తనని మనిషిగా నిలబెట్ట...నికి తోడ్పడుకున్న ఆ జంటకి కృతజ్ఞతలు చెబుతూ లెటర్ రాశాడు.

...మెమో చూసి చాలా ఆనందంగా భర్తకి చూపించింది రేణుక.

''మంచి మార్కులు వచ్చాయి కదండీ.'' సంతోషంగా అందామె.

''మంచి మార్కులంటావేం? బ్రహ్మాండమైన మార్కులైతే.'' తనూ సంతోషపడుతూ అన్నాడు సారథి.

''అన్నట్టు దీంతోపాటు ఓ లెటర్ కూడా రాసాడు. రెండు నెలలు కాలేజీకి శెలవులు కాబట్టి, ఈ రెండు నెలలు డబ్బు పంపక్కర్లేదు అని రాశాడు. ఆ డబ్బుతో ఏ బట్టలో, మరొకటో కొనుక్కోవచ్చునని ఆశ పడలేదు. ఎంత నిజాయితీపరుడు. మరెంత అభిమానవంతుడు. బంగారంలాంటి కుర్రాడు కదండీ..''

''నిజమే! డబ్బు చేదా ఏంటి? ఏ సినిమాలో సింగినాదాలో చూసి జల్సా చేద్దాం అనుకోకుండా, డబ్బు పంపొద్దని రాశాడు. ఛాలా సిన్సియర్ పర్సన్ అని ఒప్పుకు తీరాల్సిందే!'' సారథి మనఃస్ఫూర్తిగా అన్నాడు.

ఏదో ఆలోచిస్తున్నట్టుగా మౌనంగా వుండిపోయింది రేణుక. రెండు క్షణాల తర్వాత సీరియస్‌గా అంది. ''నేనో నిర్ణయానికి వచ్చానండి.''

''వచ్చావా? ధన్యులం. అదేంటో సెలవీయండి.''

రేణుక అతని వైపు చూసి నవ్వింది. వచ్చి పక్కనే కూర్చుంది.

''ఈ సంవత్సరం నుండీ ఆ కుర్రాడి మొత్తం ఖర్చు అంటే బట్టలు, వంట చేసుకోవడానికవసరమయ్యే సరుకుల ఖర్చులతో సహా నేనే ఇవ్వాలనుకుంటు న్నాను. అతని నిజాయితీకి ఇదినా రివార్డు. మీరేమంటారు?'' భర్త మొహంలోకి చూస్తూ ప్రశ్నించింది.

''ఏమంటాను? శ్రీమతి ఏమన్నా శ్రీవారు తందానతాన అంటాను'' చిలిపిగా అన్నాడు సారథి.

''అల్లరి మాని సీరియస్‌గా చెప్పండి. నేను తీసుకున్న డెసిషన్ మంచి దేనా?''

''నీ ఆలోచనలు, నిర్ణయాలు ఎప్పుడూ మంచివే రేణూ. కాదని ఎలా అనగలను?'' సారథి గంభీరంగా అన్నాడు.

రేణుక భర్తవైపు ఆనందంగా చూసి, ''థాంక్స్'' అంది.

''మధ్యలో నాకెందుకూ థాంక్స్ చెప్పడం?''

''డబ్బు వేస్ట్ చేస్తున్నావు అని క్లాస్ తీసుకోనందుకు. ఒకరికి సహాయపడ్డంలో వున్న ఆనందం, సంతృప్తి, మనిషికి ఇంకెందులోనూ వుండవండి! ప్రతీ మనిషికి ఏవో కొన్ని కోరికలు వుంటాయి. అవి తీరే కోరికలు అయితే ఫర్వాలేదు. కానీ తీరని కోరికలైతే మాత్రం, జీవితాంతం అవి వెన్నంటి తిరుగుతూ, మనసుని వేధిస్తూనే వుంటాయి. ఈ ప్రపంచంలో ఎంతో మందికి వీలుకాక, అవకాశాలు రాక, వారి ఆశలు, ఆశయాలు మొగ్గ ప్రాయంలోనే రాలిపోతున్నాయి. అలా రాలిపోతే తట్టుకుని నిలబడే మానసిక ధైర్యం అందరికీ వుండదు. ఆ విధంగా ఒక రకమైన నిస్పృహ, నైరాశ్యం, డిప్రెషన్ ఆవరించి వున్న స్థితిలో మనిషిలో నుంచి మరో మనిషి బైటికి వస్తాడు. అతడో మృగం కావచ్చు, రాక్షసుడు కావచ్చు, శాడిస్టు కావచ్చు, సైకో కావచ్చు. మరొకటి మరొకటి కావచ్చు. అప్పుడు భయంకరమైన పరిణామాలు చోటు చేసుకుంటాయి. మన కళ్ళ ముందు చూస్తూ చూస్తూ ఏ మనిషినీ క్రూర జంతువుగా మారనీయకూడదు. అది అతని చుట్టూ వున్న మనుషులకీ, సమాజానికీ చాలా ప్రమాదం.''

ఆమె చెప్పేది వింటున్న సారథి ముగ్ధుడయ్యాడు. ఆమె మంచితనం, ఆర్ద్రత, దయ లాంటి సహజ గుణాలు రోజూ ఆమెలో చూస్తూనే వున్నా ఎప్పటికప్పుడు అతనికి కొత్తగానే వుంటుంది.

కన్నార్పకుండా తనవైపే చూస్తుండిపోయిన భర్తని చూసి, ''ఏంటలా చూస్తున్నారు?'' అనడిగింది.

''అబ్బే ఏవీ లేదు. నువ్వు చెప్పేది వింటున్నా. చాలా మంచి విషయాలు చెబుతున్నావు కదా. చెప్పు చెప్పు'' ఆమెను ఎంకరేజ్ చేస్తూ అన్నాడు.


''ఇలా ఒకరికి సహాయం చెయ్యడం వల్ల మనకేవిటి లాభం? మనకి వచ్చేదేవిటి? అని మీకనిపించడం లేదా? నిజం చెప్పండి..'' రేణుక సూటిగా ప్రశ్నించింది.

''లేదు'' సారథి తల అడ్డంగా వూపాడు. ''ఒక మంచి పని చేసేటప్పుడు లాభనష్టాల ప్రసక్తి అవసరం లేదు. ఒక వ్యక్తిని, వ్యక్తి శక్తియుక్తుల్ని, ఒక మంచి మార్గంలోకి మళ్ళించడం వల్ల కలిగే సంతృప్తికి కొలతలు, లాభనష్టాల లెక్కలు అనవసరం.''

''నిజమే! మనలో చాలా మందికి వున్న డబ్బుని ఎలా సద్వినియోగం చేయాలో తెలీదు. దేవాలయాల్లోని హుండీల్లో నోట్ల కట్టలు పడెయ్యడం, దేవుడి విగ్రహాలకి లక్షలు లక్షలు ఖర్చుపెట్టి ఆభరణాలు చేయించడం... దీని బదులు ఆ డబ్బుని నిస్సహాయులని ఆదుకునేందుకు ఉపయోగిస్తే ఆ భగవంతుడు కూడా ఎంతో సంతోషిస్తాడు. హుండీల్లో పడేసే డబ్బుని ఆ భగవంతుడు ఏం చేసుకుంటాడు? ఆయనకి డబ్బుతో అవసరం లేదు. 'మానవ సేవే మాధవ సేవ' అన్న విషయం అందరికీ తెలుసు. అయినా దాన్ని ఎవరూ ఆచరించరు. తన పక్కనున్న వాడు ఏమైపోతున్నా మనిషి పట్టించుకోడు. స్వార్థం, సంకుచితత్వం ఇలా పెచ్చు పెరిగిపోవడం మంచి పరిణామం కాదు. మనిషిలో వుండే శక్తియుక్తులు ఒక అవరోధం కారణంగా అంతర్గతంగానే అదృశ్యమైపోయే దుస్థితి ఎవరికీ కలగకూడదు. ఒక మనిషిని నిలబెట్టడానికి మరో మనిషి తన చేతనైన సాయం చేయాలి. అప్పుడు సమాజం... తద్వారా దేశం, ప్రపంచం అంతా బాగుపడుతుంది.''

''ఆహా! ఏం స్పీచ్. ఇంత వరకూ నేనెప్పుడూ వినలేదు.'' క్లాప్స్ కొడుతూ అన్నాడు సారథి.

రేణుక భర్త ఇచ్చిన కాంప్లిమెంటును పట్టించుకోలేదు. అంతటా ఒక మంచినీ, ఒక మానవత్వాన్ని చూడాలన్న తపన, తహతహ కలబోసుకున్న మాటల ఊటలు ఆమె గుండెలోతుల నుండీ ఒక ప్రవాహంలా పెల్లుబికాయి.




సోఫాలో వెనక్కి వాలి అతను వింటున్నాడు.

''కొడిగట్టిపోతున్న దీపాన్ని చమురుపోసి వెలిగించడం మన బాధ్యత! ఒక చిన్న దీపం వెలిగితే కొండంత వెలుతురునిస్తుంది. ప్రతీ మనిషి ఒక్క దీపాన్ని వెలిగిస్తే చాలు. లోకమంతా వెలుగుల సంరంభమే. అప్పుడిక చీకటికి చిరునామాయే వుండదు. అందుకే అంటున్నాను. ఓ మనిషీ! వెలిగించు ఒక్క మానవతా దీపాన్ని!'' ●